క్లుప్తంగా

'గైస్'లో సేఫ్టీ కోర్సులు భేష్



డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్ తోటకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్)లో సేఫ్టీ కోర్సుల నిర్వహణ బాగుందని నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్(ఎన్‌సీవీఈటీ) డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్ తోట కితాబిచ్చారు. ఆదివారం ఆయన ఢిల్లీ నుంచి విశాఖ వచ్చిన సందర్భంగా గైస్‌లో నిర్వహిస్తున్న సేఫ్టీ కోర్సులను పరిశీలించారు. ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ, కెమికల్ సేఫ్టీ కోర్సుల తరగతుల నిర్వహణ, ప్రాక్టికల్స్‌కు సంబంధించిన వివరాలను ఆయన స్వయంగా పరిశీలించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ కోర్సుల నిర్వహణకు సంబంధించిన వివరాలను డిప్యూటీ డైరెక్టర్‌కు తెలియజేశారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

సీతంపేట: ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ 69వ జన్మదినోత్సవం సందర్భంగా పి.వి.సహాయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం సీతమ్మధార సితార ఎన్‌క్లేవ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. 40 మంది దాతలు రక్తదానం చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ బ్లడ్ బ్యాంక్ వైద్య సిబ్బంది దాతల నుంచి రక్తం సేకరించారు. ఈ సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ పి.వి.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినపుడు క్షతగాత్రులను కాపాడటానికి రక్తం చాలా అవసరమని, రక్తదానంతో మరొకరి ప్రాణం రక్షించవచ్చని రక్తదాన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పి.శ్రీనివాసరావు, జి.సాంబమూర్తి, బి.శ్రీరంగ, డి.రమేష్, ఎం.గురునాథ్, పి.సత్యారావు. బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి ఎస్.సుధాకరరావు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు



విశాఖ రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఫోర్త్ టౌన్ పోలీసులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆదివారం నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలతో గవర్నమెంట్ రైల్వే పోలీసులతో కలిసి ఫోర్త్ టౌన్ పోలీసులు, నార్కోటిక్స్, డాగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మత్తుపదార్థాల అక్రమ రవాణా, అనుమానితుల కదలికలపై తనిఖీలు చేశారు. రైల్వే స్టేషన్‌లోని పార్సిల్ కార్యాలయం, బుకింగ్ కౌంటర్లు, ప్లాట్‌ఫారాలు, వెయిటింగ్ హాళ్లు, పార్కింగ్ ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

మోదీ పాలన దేశ ప్రగతికి అంకితం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మద్దిపాలెం: ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన దేశ సమగ్ర ప్రగతికి అంకితమైందని ఎమ్మెల్యే పి.విష్ణుకుమరాజు అన్నారు. బిర్లా జంక్షన్ సమీపంలోని బొత్స కన్వెన్షన్ సెంటర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'సంకల్ప్ సే సిద్ధి' కార్యశాలలో ఆయన మాట్లాడారు. జాతీయ భద్రతకు ప్రాధాన్యమిస్తూ మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమం, డిజిటల్ పరివర్తన, పేదరిక నిర్మూలన దిశగా మోదీ పాలన సాగిందన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని ప్రధాని విశాఖ రానున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను, వాటి ప్రయోజనాలను వివరించాలని,'వికసిత్ భారత్' నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.


స్మృతి వనాలు



వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో మహాత్మా గాంధీ నిలువెత్తు విగ్రహం



వాకర్స్ పార్కులో ఉత్తరాంధ్ర తేజోమూర్తుల తైలవర్ణ చిత్రాలు




శ్రీదేవి పార్కులో కొలువైన లక్ష్మీదేవి



ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో వివేకానందుడు



బృందావన్ పార్కులో తథాగతుడి భారీ విగ్రహం



ప్రశాంతి పార్కులో రామకృష్ణ పరమహంస విగ్రహం



వాకర్స్ పార్కులో ధ్యానముద్రలో బుద్ధుడు



- మురళీనగర్ పార్కుల్లో స్ఫూర్తిప్రదాతల విగ్రహాలు
- నేటి తరాలకు మహనీయులను పరిచయం చేసేలా ఏర్పాటు
- ఆధ్యాత్మికతను పంచుతున్న దైవ మందిరాలు
- విజ్ఞానాన్ని పెంపొందించేలా పార్కులను తీర్చిదిద్దుతున్న నిర్వాహకులు

మురళీనగర్: పార్కులంటే కేవలం పచ్చదనమే కాదు.. సమాజ హితానికి ఉపయోగపడాలి. ఆట పరికరాలు, జిమ్‌లు ఏర్పాటు చేస్తే సరిపోదు.. వీటిని సందర్శకుల విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా తీర్చిదిద్దాలని భావించారు మురళీనగర్‌లోని పార్కుల నిర్వాహకులు. నాటి తరాల సాంస్కృతిక వారసత్వ సంపదను నేటి తరాల ద్వారా భావితరాలకు అందించాలనే సదాశయంతో పార్కులను తీర్చిదిద్దారు. దీనిలో భాగంగా అలనాటి గొప్ప నాయకులు, స్వాతంత్య్ర సమర యోధులు, రచయితలను పరిచయం చేసేందుకు పార్కుల ప్రాంగణాన్ని స్మృతి వనాలుగా తీర్చిదిద్దారు.

అన్నీ ప్రత్యేకం

మురళీనగర్ పార్కుల్లో ఏర్పాటు చేసిన స్ఫూర్తిమంతమైన నాయకుల విగ్రహాలన్నీ చాలా ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. వైశాఖీ స్పోర్ట్స్ పార్కు, మురళీనగర్ వాకర్స్ పార్కు, బృందావన్ పార్కు, హరిత పార్కు, ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కుల్లో కొలువుదీరిన విగ్రహాలు వేటికవే ప్రత్యేకమైనవి. పార్కు నిర్వాహకులు ముందుచూపుతో ప్రతిష్ఠించిన ఈ విగ్రహాలు భావితరాలకు మన సాంస్కృతిక, సామాజిక నేపథ్యాన్ని తెలిపే విధంగా ఉంటాయి. వీటిని పార్కు సందర్శకులు చూసి తరిస్తున్నారు.

దాతలే సారథులు

పార్కుల్లో వివిధ విగ్రహాల ఏర్పాటుకు దాతల సాయంతోపాటు స్థానిక పార్కుల నిర్వాహకులు, వాకర్స్ క్లబ్ సభ్యులు సహకరించడం విశేషం. ముఖ్యంగా వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ నిలువెత్తు విగ్రహం నగరానికి తలమానికంగా నిలుస్తుంది. ఈ విగ్రహాన్ని 2006 రిపబ్లిక్ డే నాడు అప్పటి నగర కమిషనర్ ఎస్.శ్రీకాంత్ ఆవిష్కరించగా.. దీని మండపాన్ని 2011లో ఎ.కృష్ణారెడ్డి, ఎ.బాలసరస్వతి దంపతులు నిర్మించారు. ప్రతి ఏడాది గణతంత్ర, స్వాతంత్య్ర దిన వేడుకలు ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు. వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన మహాత్ముడి విగ్రహం ప్రత్యేకంగా నిలుస్తుంది.

తేజోమూర్తులు

బృందావన్ పార్కు, హరిత పార్కులో ఏర్పాటు చేసిన తథాగతుడు, బుద్ధ భగవానుడి భారీ విగ్రహాలు, ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులోని భారతీయుల వసుధైక కుటుంబం భావనలను ప్రపంచ వ్యాప్తం చేసి, యువతలో సేవాభావాలను పాదుకొల్పిన మహానుభావుడు వివేకానందుడి నిలువెత్తు విగ్రహాలు అత్యంత ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. వాకర్స్ పార్కులో బోధి వృక్షం వద్ద ధ్యాన ముద్రలో ఉన్న బుద్ధుడు, వైశాఖీ స్పోర్ట్స్ పార్కులోని బుద్ధ భగవానుడు మనలో అహింసా భావాలను పాదుకొల్పుతున్నారు. వాకర్స్ పార్కులో ఉత్తరాంధ్ర తేజోమూర్తులైన విప్లవ జ్వాల రగిలించిన అగ్గిపిడుగు అల్లూరి సీతారామ రాజు, బడుగుల గుండె చప్పుడు ప్రముఖ రచయిత శ్రీశ్రీ, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు, వ్యావహారిక భాషకు వన్నె తెచ్చిన గిడుగు వెంకట రామమూర్తి, స్వాతంత్య్ర సమరయోధుడు తెన్నేటి విశ్వనాథం, అమరజీవి పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ తైలవర్ణ చిత్రాలు ప్రజల్లో దేశ భక్తిని పెంచుతున్నాయి. పేరుకు తగ్గట్టుగానే ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో రామకృష్ణ పరమహంస, శారదాదేవి, శంకరాచార్యులు, షిర్డీసాయినాథుడి పాలరాతి విగ్రహాలు దాతల సాయంతో ఏర్పాటు చేశారు. ఇక్కడి ఆధ్యాత్మిక మందిరాలు సందర్శకులకు ప్రశాంతతను అందిస్తున్నాయి. శ్రీదేవి పార్కులోని లక్ష్మీదేవి విగ్రహం ప్రజల్లో ఆధ్యాత్మిక భావనలు పెంపొందిస్తుంది.

స్ఫూర్తిదాయక విద్యార్థిని తన్వి రిషిక



తన్వి రిషికను సత్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

సీతంపేట: అసాధారణ ప్రతిభతో రాణిస్తున్న 12 ఏళ్ల ఇంజరపు తన్వి రిషిక 2025 సంవత్సరానికి స్ఫూర్తిదాయక విద్యార్థినిగా ఎంపిక కావడం అభినందనీయమని నగర పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి అన్నారు. తన్వి పట్టుదల, శక్తి ఇతర విద్యార్థులకు ప్రేరణ కావాలన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 'అన్‌సంగ్ హీరోస్ ఆఫ్ ఇండియా 2025' పేరిట జ్యోతి కొత్తపల్లి నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీ.. తన్వి రిషికను సత్కరించారు. ఈ సందర్భంగా రిషిక తాను సాధించిన విజయాలను వివరించింది. రాజస్థాన్ జైపూర్‌లో జరిగిన ఫరెవర్ స్టార్ ఇండియా పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించి ప్రతిష్టాత్మకమైన ప్రిన్సెస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టైటిల్ గెలుపొందినట్టు తెలిపింది. బ్యాంకాక్, థాయ్‌లాండ్‌లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించి సూపర్ టాలెంట్ ప్రీ టీన్ ఆఫ్ ఇండియా టైటిల్ గెలుపొందినట్టు పేర్కొంది. ఈ నెల 22న ముంబయిలో ప్రారంభం కానున్న డ్యాన్స్ కా దంగల్ సీజన్ 3లో పాల్గొననున్నట్టు తన్వి తెలిపింది.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి



మురళీనగర్ అపార్ట్‌మెంట్ వాసులతో మాట్లాడుతున్న జెడ్సీ రాము

మురళీనగర్: విశాఖలో ఈ నెల 21న నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ బొడ్డేపల్లి రాము పిలుపునిచ్చారు. మురళీనగర్, మాధవధార జంట కాలనీల్లోని అపార్ట్‌మెంట్ వాసులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగా దినోత్సవాన్ని రికార్డుల్లో నమోదయ్యేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఇందులో పాల్గొనే వారికి ఉచితంగా బస్సు ఏర్పాటు చేశామని, టీ–షర్టులు ఇస్తామని తెలిపారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల వరప్రసాద్, వివిధ అపార్ట్‌మెంట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం పదిలం



మాట్లాడుతున్న డాక్టర్ పైడి రమణమూర్తి

మురళీనగర్: ప్రతి రోజూ కనీసం 45 నిమిషాలు నడవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని డాక్టర్ పైడి రమణమూర్తి అన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం క్లబ్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో నడక ప్రాధాన్యం, ఆరోగ్య పరిరక్షణకు వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను ప్రశంసించారు. ఆయన వాకర్స్ క్లబ్ సభ్యత్వాన్ని తీసుకుని, వాకర్స్ వాయిస్ పత్రికను ఆవిష్కరించారు. డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్ నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. యోగా గురువు సునీల్‌ను సత్కరించారు. చదరంగం కోచ్ ఎస్.ఉమాపతిని అభినందించారు. జూన్‌లో పుట్టినరోజు జరుపుకుంటున్న సభ్యులకు చిరుకానుకలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, కార్యదర్శి సిహెచ్.ఎస్.ఎస్.వి.ప్రసాదరావు, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి ఎస్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సింహగిరిపై విశేషంగా నృసింహ హోమం



కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో తదితరులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ఉత్తరరాజగోపురం ఎదురుగా ఉన్న విశాల ప్రాంగణంలో ఈ హోమాన్ని నిర్వహించారు. హోమంలో 22 మంది ఉభయదాతలు ప్రత్యక్షంగా, 87 మంది ఉభయదాతలు పరోక్షంగా పాల్గొన్నారు. ఉత్తరరాజగోపురం ఎదురుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులైన గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజింపచేశారు. హోమగుండం వద్ద పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలతో స్వామివారి అష్టోత్తర శత నామావళిని పఠింపజేశారు.

అనంతరం కుంభ ప్రోక్షణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. దేవస్థానం ఈవో వి. త్రినాథరావు, విజయనగరం ఆర్డీవో ఎస్. శ్రీనివాసమూర్తి, ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్, స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, అర్చకుడు గిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టం పటిష్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఫోరం కన్వీనర్ నరవ ప్రకాశరావు

సీతంపేట: విద్యా హక్కు చట్టం–2009ను పటిష్టంగా అమలు చేయాలని రైట్ ఎడ్యుకేషన్ ఫోరం కన్వీనర్ నరవ ప్రకాశరావు డిమాండ్ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో విద్యా హక్కు చట్టం అమలు తీరుపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజుల నియంత్రణ చట్టం కఠినంగా అమలు చేయాలని కోరారు. విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకు తల్లిదండ్రులు సమైక్యంగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధాన ప్రకటన చేయాలని, ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లోని నోటీస్ బోర్డుల్లో ఫీజుల వివరాలు ఉండేలా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. డ్రాప్ అవుట్స్ తగ్గించేలా, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు, సామాజిక వేత్తలు కరుణ, విశ్వనాథం, హుస్సేన్, పి.సి.రావు, సత్యవతి, నరసింహారావు, చాట్ల బాబూరావు రెడ్డి పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో నడుచుకోండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కంచరపాలెం సీఐ చంద్రశేఖర్

మద్దిపాలెం: ఎటువంటి తగాదాలు, గొడవల జోలికి పోకుండా రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ చంద్రశేఖర్ సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు ఎటువంటి అఘా యిత్యాలు, కొట్లాటల జోలికి వెళ్లినా ఊరు కునేది లేదని హెచ్చరించారు. వారిపై ఎల్లప్పు డూ నిఘా ఉంటుందని, హద్దు మీరి ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మంచిగా మెలగాలని, కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవించాలని రౌడీషీటర్లకు సీఐ సూచించారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ చిన్నంనాయుడు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్‌ఐ చిన్నంనాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు ఎటువంటి గొడవల్లో తలదూర్చకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. హద్దు మీరితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

పొంగిన యూజీడీలు.. రోడ్డెక్కిన మురుగు



నరసింహనగర్ రైతుబజార్ వద్ద లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్



హైవే వరకు ప్రవహిస్తున్న మ్యాన్‌హోల్ మురుగు నీరు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45, 14 వార్డుల పరిధిలోని నరసింహనగర్ రైతుబజార్ మెయిన్ రోడ్డు ప్రాంతంలో యూజీడీ మ్యాన్‌హోళ్లు పొంగిపార్లుతున్నాయి. రైతుబజార్ నుంచి జాతీయ రహదారి వరకు యూజీడీ మురుగు నీరు ప్రవహిస్తోంది. ఈ మురుగుతో నరసింహనగర్ వాసులతోపాటు హైవేలో ప్రయాణించే వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి యూజీడీలు లీకవకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సముద్రాలను సంరక్షించుకోవాలి



తీరంలో వ్యర్థాలను సేకరిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

ఏయూక్యాంపస్: భావితరాల కోసం సముద్రాలను పరిరక్షించాలని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ప్రపంచ సముద్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం సాగర తీరాన్ని శుభ్రం చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ స్వయంగా బీచ్ రోడ్డు తీరంలోని వ్యర్థాలను సేకరించారు. దశాబ్ద కాలంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సముద్రాలు సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. మొత్తం 135 కిలోల వ్యర్థాలను సేకరించి జీవీఎంసీకి అందజేశారు. కార్యక్రమంలో సీఎంఎఫ్‌ఆర్‌ఐ, సీఐఎఫ్‌టీ, ఎన్‌సీసీఆర్, ఎస్ఎస్‌టీఏల్ వంటి ప్రభుత్వరంగ సంస్థల సిబ్బంది, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, జువాలజీ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద తీరం.. ఆరోగ్య యోగం



ఏయూక్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవానికి నగరం సిద్ధమవుతోంది. సాగర తీరం వేదికగా జరగనున్న ఈ కార్యక్రమానికి దేశ ప్రధాని మోదీ హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా యోగాపై అవగాహన కల్పిస్తూ వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సాగర తీరంలో పలువురు యోగా సాధన చేస్తూ కనిపించారు. ఇసుక తిన్నెలపై కూర్చుని యోగా, ధ్యానం చేశారు.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సాగర తీరాన.. సందడే సందడి



సాగర తీరమంతా ఆదివారం సందడి వాతావరణంతో కోలాహలంగా మారింది. వేసవి సెలవులు ముగియనున్న నేపథ్యంలో పిల్లలతో కలిసి నగరవాసులు అధిక సంఖ్యలో బీచ్‌కు వచ్చారు. ఆర్.కె. బీచ్ నుంచి విక్టరీ ఎట్ సీ వరకు సందడి చేశారు. ఇసుకలో ఆడుకుంటూ, సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపారు. తీరం పొడవునా ఉన్న పార్కులు, పర్యాటక ప్రాంతాలన్నీ నగరవాసులు, సందర్శకులతో కిక్కిరిసిపోయాయి. విక్టరీ ఎట్ సీ వద్ద లేజర్ షో ఆకట్టుకుంది. 1971 యుద్ధ విశేషాలను వివరిస్తూ షో ప్రదర్శించారు.

- ఏయూక్యాంపస్